# 10

# సమతుల జీవితము

## (13వ అధ్యాయం)

హెబ్రీ పత్రిక గ్రంథకర్త తన పత్రికను హెబ్రీయులకు వ్రాయడం దాదాపుగా ముగింపునకు వచ్చింది. అతడు తాను చెప్పదలుచుకున్న సిద్ధాంతిక విషయములను చెప్పాడు. విశ్వాసహీనతకు వ్యతిరేకంగా తన పాఠకులను హెచ్చరించాడు. ఆఖరికి "ఈ పత్రికను ఎలా ముగించాలి?" అని తనలో తాను ప్రశ్నించుకున్నాడు. "వీరు క్రీస్తు కొరకు ప్రతి దినము బ్రదుకుటకు వీరికి కొన్ని ఆచారణాత్మక విషయాలను ఇస్తాను" అని అనుకున్నాడు. ఇతర క్రొత్త నిబంధన పత్రికలవలెనే ఆచరణాత్మక సూచనలతో ఈ పత్రిక ముగించబడింది. ఈ సూచనలు క్రైస్తవ జీవితమునకు కొన్ని సూచనలు చేస్తున్నాయి. వీటిని చూస్తే, సమతుల్య ఆత్మీయ జీవితమును జీవించుటకు ఇది సరైన సూచికగా ఉన్నట్లు అన్పిస్తుంది.

సమతుల్య జీవితమును జీవించడం యొక్క అవసరతను మనం అర్థంచేసుకోగలము. ఉదాహరణకు పని మన జీవితంలో మంచిదే! అయితే వారానికి అరవై డెబ్బై, ఎనభై గంటల పాటు తమ ఉద్యోగంలోనే గడిపే "పని పిశాచులు" మనకు తెలుసు. వారు పని తప్ప మరి దేని గురించి పట్టించుకోరు. మరి కొంతమంది తమ వ్యాసకాల్లోను, ఆటల్లోనూ, శారీరిక వ్యాయామాల్లోనూ సమయాన్ని ఎక్కువగా గడిపేస్తుంటారు. వీరందరూ మరింత సమతుల్య జీవితాన్ని జీవించాలి. తమ కుటుంబాలకు తగిన సమయాన్ని కేటాయించాలి.

అలాగే మనం సమతుల ఆత్మీయ జీవితమును జీవించుటకు మనం ప్రోత్సహించబడాలి. ఒక్కోసారి కొంతమంది క్రైస్తవులు క్రైస్తవ్యంలోని ఒకటి రెండు సూత్రముల మీదనే ఎక్కువగా దృష్టిపెడతారు మిగతావాటిని పట్టించుకోరు. కొన్ని సంఘాలవారు సత్యమును గురించే మాట్లాడుతారు. అబద్ధ బోధను ఎప్పుడూ ఖండిస్తుంటారు. అట్టివారు ప్రేమ మరియు కృపను నిర్లక్ష్యం చేస్తుంటారు. కొంతమంది సోదరులు శుద్ధత గురించే చెప్తుంటారు. అనైతికత గురించి ఎప్పుడూ ప్రజలను హెచ్చరిస్తుంటారు. మరి కొంతమంది కేవలం క్రైస్తవ ప్రేమ మీదనే దృష్టిపెడుతుంటారు. మరి కొంతమంది సోదరులు ఆరాధన గురించే ఎక్కువగా చెప్తుంటారు. మరి కొంతమంది ఇతరులకు సహాయం చేయడం గురించి చెప్తుంటారు. కొంతమంది మాత్రమే సువార్త మరియు పరిచర్య గురించి ఆలోచిస్తుంటారు.

సంఘమునకు సంబంధించిన ప్రతి విషయం ముఖ్యమైనదే! ఒక వ్యక్తికున్న తలాంతు అతనిని విభిన్న రంగాలలో ఆసక్తి ఉండేలా చేయగలదు. సమతుల క్రైస్తవ జీవితం జీవిస్తున్న వ్యక్తిలో ఎన్నో మంచి అవకాశాలు, సత్క్రియలు ఉంటాయి. మనం సమతుల క్రైస్తవ జీవితమును జీవించాలి. ఎలా జీవించాలన్న విషయాన్ని హెబ్రీయులకు 13వ అధ్యాయం తెలియజేస్తుంది. ఆ జీవితం యొక్క లక్షణాలను చూద్దాము.

### ప్రేమైక జీవితము

*మొదటిగా, సమతుల జీవితం అంటే ప్రేమైక జీవితము.* ప్రత్యేకించి సహోదరుల

పట్ల ప్రేమ. (చదవండి హెబ్రీయులకు 13:1–3.) సాధారణ వ్యాఖ్యలో 13వ అధ్యాయం ప్రారంభమవుతుంది. “సహోదరప్రేమ నిలువరముగా ఉండనీయుడి.” ఈ క్రైస్తవులు ఒక అనిశ్చిత భవిష్యత్తును ఎదుర్కొన్నారు. విశ్వాసహీనత మరియు హింస విషయంలో వారు ప్రమాదం బారిన పడ్డారు. వారు ఇట్టి పరిస్థితుల్లోనున్నందుకు ఒకరినొకరు ప్రేమింపవలసిన అగత్యత ఏర్పడింది. వారు ఇదివరకే సహోదర ప్రేమను కలిగియున్నారు. దాన్ని వారు ఇంకనూ కొనసాగించాలి. వారి జీవితంలో మరింతగా దాన్ని పెంపొందించుకోవాలి. ఒకరి పట్ల ఒకరి ప్రేమను మనం పదిలపరచుకోవాలి. ఇది కొనసాగునట్లు అలాగే ప్రతి ఒక్కరియందు ఇది వ్యక్తపరచబడునట్లు మనం చూడాలి.

తరువాతదిగా, రెండు విధాలుగా సహోదరప్రేమను ప్రదర్శించడం గురించి ఇయ్యబడింది:

(1) “క్రొత్తవారికి ఆతిథ్యము చేయాలి.” మొదటి శతాబ్దపు క్రైస్తవులు ప్రయాణిస్తున్నప్పుడు, ఇతర క్రైస్తవుల యొద్ద తప్ప మరి ఎక్కడా వారికి ఆశ్రయం దొరికేది కాదు. ఇక్కడ వాడబడిన “ఆతిథ్యము” అను మాట ప్రయాణంలో ఉన్న పరిశుద్ధులనుద్దేశించినదే కావచ్చు.

(2) “బంధనములో ఉన్నవారిని జ్ఞాపకము చేసుకొనుడి.” ఇక్కడా కూడ, ఇది బంధకములలో ఉన్న సాధారణ ఖైదీలను గురించి గాక తమ విశ్వాసమును బట్టి ఖైదుచేయబడిన క్రైస్తవులను గురించినదే కావచ్చు.

మనం కూడ శోధనలలో హింసలలో ఉన్న సహోదరులపట్ల ఆతిథ్యమును, ఆదరణను చేయువారమైయుండాలి. క్రైస్తవ జీవితం ప్రేమైక జీవితము.

## నైతిక జీవితము

రెండవదిగా, సమతుల జీవితం అంటే నైతిక జీవితము. యిక్కడ కనబడుతున్న ఉదాహరణ వివాహ వాగ్దానములకు సంబంధించినది. “వివాహము అన్ని విషయములలో ఘనమైనదిగాను, పానుపు నిష్కల్మషమైనది గాను ఉండవలెను; వేశ్యా సంగులకును వ్యభిచారులకును దేవుడు తీర్పు తీర్చును” అని హెబ్రీయులకు 13:4 చెప్తుంది. క్రైస్తవ జీవితంలో క్రైస్తవ వివాహము ప్రత్యేకమైనది అని ఈ వాక్యభాగం చెప్తుంది.

క్రైస్తవ వివాహం అనేది చిన్నచూపు చూడబడేది కాదు ఇది “ఘనముగా” ఎంచ బడేది. నిజానికి కన్యత్వముతో ఉండడం పరిశుద్ధముగా ఉండడం కాదుగాని, వివాహం చేసుకోవడం పరిశుద్ధముగా ఉండడం. అయితే ఈనాడు వివాహ వ్యవస్థ ఎన్నోసార్లు అగౌరవపరచబడుతుంది. ఒక రాష్ట్రస్థాయి యూనివర్సిటిలో నా భార్య తరగతిలో ఉండగా తన సోషియాలజీ క్లాసులో వివాహం మరియు కుటుంబం గురించి చర్చించబడింది. ముప్పై మందిలో ఈమె ఒక్కతే వివాహం మరియు కుటుంబం గురించి సానుకూలంగా చెప్పింది. లోకం దీని గురించి ఎలా అనుకున్నా గాని క్రైస్తవులు మాత్రం దీన్నే గౌరవించాలి.

వివరంగా చెప్పాలంటే, క్రైస్తవ వివాహం విభిన్నమైంది ఎందుకుంటే నమ్మకమైన క్రైస్తవులు “వివాహపానుపును” కల్మషము చేయరు. వారు అనైతిక ప్రవర్తన లేదా వ్యభిచారత్వము గురించి అపరాధులుగా ఉండరు. ఎందుకు? ఎందుకంటే, లైంగిక పాపం గురించి, దేవుడు వారిని శిక్షిస్తాడని వారికి తెలుసు. వ్యభిచారం అనేది దేవునికి వ్యతిరేకంగా, భార్య లేదా భర్తకు వ్యతిరేకంగా, ఎవరితోనయితే వ్యభిచారం చేస్తున్నారో వారికి వ్యతిరేకంగా చేసే పాపం.

ఇటువంటి పాపం నుండి మనం తప్పించుకోవాలి. *క్రైస్తవ జీవితం నిష్కల్మషమైన జీవితం.*

## క్రైస్తవ జీవితము నమ్మకమైన జీవితము

*మూవదిగా సమతుల జీవితం అంటే నమ్మకమైన జీవితము* – ప్రత్యేకించి దబ్బు విషయంలో హెబ్రీయులకు 13:5, 6 రెండంచుల గల ఆజ్ఞలను యిస్తుంది. క్రైస్తవులుగా మనం ధనాపేక్షకు దూరంగా జీవించాలి. అలాగే మనకున్న దానిని బట్టి మనం సంతృప్తిగా ఉండాలి. క్రొత్త నిబంధనలో అత్యంత నిరాధరణకు గురవుతున్న ఆజ్ఞ ఏది అంటే, అది ఇదే!

ధనాపేక్ష అంటే ఏమిటి? ధనం కలిగియుండడం తప్పుకాదు. ఈనాడు సమాజంలో జీవించడానికి ధనం ఎంతో అవసరం. మరయితే ధనాపేక్ష అంటే ఏమిటి? బహుశ మొదటి రాసిన వచనంలోని రెండవ భాగం వివరిస్తుంది. ధనాపేక్ష అంటే అసంతృప్తిగా ఉండడం! మరింతగా, ఇంకా ఎక్కువగా కావాలని కోరుకోవడం! ఈ వివరణ మనకు అర్థమవుతుందా?

ఈ ఆజ్ఞను లోబడియుండుటకు ఒక కారణాన్ని ఈ వచనాలు యిస్తున్నాయి. మనం ధనమును ఎందుకు ఆశించకూడదు? ఎందుకంటే దేవుడు మనలను గురించి శ్రద్ధ తీసుకుంటానని వాగ్దానం చేశాడు (13:5, 6). మనం ధనాపేక్షను కలిగియుంటే, మనకు సంతృప్తి లేకుండా ఉంటే, మనకు మరింత ఆస్థులు, మరింత ధనం కావాలని ఆశపడుతుంటే, ఆర్థికంగా మనం ఉన్నతంగా ఉండాలని ఆశపడితే దాని అర్థం మనకు దేవుని యందు సరైన నమ్మిక లేదనే కదా? *క్రైస్తవ జీవితం అంటే నమ్మకమైన జీవితం.*

## సత్యమైన జీవితం

*నాల్గవదిగా, సమతుల జీవితం అంటే సత్యమైన జీవితం, ప్రత్యేకించి* సిద్ధాంత విషయంలో హెబ్రీయులకు 13:7–14ను అర్థం చేసుకోవాలంటే, యెదుటి పాఠకులు విశ్వాసం నుండి తొలగిపోయే ప్రమాదంలో ఉన్నారు అని మనం గ్రహించాలి. ఈ ప్రమాదమునకు ఒక కారణం, అబద్ధ బోధకులు బోధలు "నానావిధములైన అన్యబోధలు" (13:9) అని ఈ పత్రికలో చెప్పబడింది.

ఈ అబద్ధ బోధకులు ఏమని బోధిస్తున్నారు? హృదయము భోజన పదార్థములను బట్టిగాక, కృపను బట్టియే అని 9వ వచనం చెప్తుంది. కాబట్టి వారి బోధన బహుశ భోజనము గురించి అయియుండవచ్చు అబద్ధ బోధకులు యూదా మతంలో నుండి వచ్చినవారై యుండవచ్చు. "మనకొక బలిపీఠమున్నది; దాని సంబంధమైనవాటిని తినుటకు గుడారములో సేవ చేయువారికి అధికారములేదు" అని 10వ వచనం చెప్తుంది. యూదా మతపు ఆచారములను గురించి బోధిస్తున్న వారి బోధకు ప్రతిస్పందనగా ఈ వ్యాఖ్య చేయబడియుంటుంది. కొంతమంది యూదా మతమును, దాని భోజన సంబంధ ఆచారములను సంఘంలో బోధించియుండవచ్చు. అలాగే తమ తప్పుడు బోధలో పరిశుద్ధులను విశ్వాసహీనులను చేసే ప్రమాదం యుండియుండవచ్చు.

అబద్ధ బోధనల శోధనలో పడిపోకుండా పాఠకులు ఎలా తట్టుకు నిలబడతారు? (1) తమకు మొదటిగా బోధించిన వారిని వారు జ్ఞాపకం చేసుకోవాలి (13:7, 8). అంటే వారి అసలైన బోధకులు తమకు ఏం బోధించారో దానిని వారు జ్ఞాపకం చేసుకోవాలి అన్న

సూచన కూడా ఇందులో ఉంది. (2) క్రైస్తవుడిని భోజనం గాక కృపయే బలపరుస్తుందన్న విషయాన్ని వారు ఎరిగియుండాలి (13:9). (3) క్రీస్తు యొక్క బలి "శిబిరము వెలుపల జరిగింది" (13:12) అని వారు గుర్తుచేయబడ్డారు అంటే యూదా మతమునకు బయటనే జరిగింది. దాని అర్థం ఏమంటే, క్రీస్తుని రక్షణ అనే బహుమానం యూదా మతపు ఆచారముల పైన, వాటి ప్రభావం పైన ఆధారపడియుండలేదు. అలాగే యూదా మతమునకు ఇంకనూ సంబంధించియున్నవారు క్రీస్తులో భాగస్థులు కారు అని అర్థం! (4) "నిలువరమైన పట్టణము" (13:14). వారికి ఇక్కడ లేదు అని వారు జ్ఞాపకం చేయబడ్డారు. బహుశా యూదులు "మాకు పరిశుద్ధ పట్టణమైన యెరూషలేము పట్టణం ఉంది. మరి మీకు ఏమి ఉంది?" అని వీరిని వేధించియుంటారు. అందుకు క్రైస్తవులు, "మాకు ఇంకనూ రాబోవు పట్టణము పరలోకంలో నిత్యత్వములో ఉంది" అని సమాధానం ఇయ్యవలసియుంది.

ఈ వాక్య భాగం సమతుల జీవితమునకు ఎలా అన్వయించబడియుంది? ఇది అబద్ధ బోధల గురించి హెచ్చరిస్తుంది కాబట్టి ఒక వ్యక్తి అబద్ధ బోధలగురించి జాగూరుడైయుండకుండా సమతుల్య ఆత్మీయ జీవితాన్ని సాగించలేడు అని చెప్పవచ్చు. మనలో ప్రేమ లేకుండగా, మనలో సువార్త భారం లేకుండా మనం సత్యమును బోధిస్తే అది విలువలేనిది అని కొంతమంది చెపుతారు. అవును అది నిజమే! అలాగే మనం సత్యమును బోధించకుండా ప్రేమకలిగి, ఉపకారం చేయుట, మరియు సువార్త భారం కలిగియుండడము కూడ విలువ లేనిదే! మనం సత్య సిద్ధాంతమును ఎరిగియుందాము! *క్రైస్తవ జీవితం అనేది సత్యమునకు సమర్పించబడిన జీవితము.*

## స్తుతి జీవితము

*ఐదవదిగా, సమతుల జీవితం అంటే దేవునికి స్తుతి అర్పించే జీవితము.* హెబ్రీయులకు 13:15ను చూడండి: "కాబట్టి ఆయనద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము. అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము." ఆ వచనము యూదా మతములోని సమకాలీన అంశమైన బలులు అనే అంశను గురించి చెప్తుంది. అయితే ఇక్కడ ముఖ్యమైన భేదం ఒకటి ఉంది: యూదులు జంతు బలులను అర్పిస్తుండగా, *క్రైస్తవులు స్తుతి బలులను అర్పిస్తున్నారు.*

క్రైస్తవుని స్తుతి బలి (a) మన పెదవులతో (పాటలద్వారా) (b) మన దేవునికి (c) నిరంతరము చెల్లించబడాలి. *క్రైస్తవ జీవితము నిరంతర స్తుతి జీవితము.*

## ఇచ్చే జీవితము

*ఆరవదిగా, సమతుల జీవితం అంటే ఇతరులకు ఇచ్చే జీవితం.* 16వ వచనాన్ని చూడండి: "ఉపకారమును ధర్మమును చేయ మరచిపోకుడి, అట్టి యాగములు దేవునికిష్టమైనవి." మన జీవితాలు నిజంగా క్రైస్తవ జీవితాలు అయితే మనం మంచి చేస్తాము, మనకున్నది ఇతరులతో పంచుకుంటాము. గమనించండి, ఉపకారం చేయడం, ధర్మం చేయడం అనేది దేవునికి అర్పించబడే మరో యాగములు. అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడమంటే దేవునికి యాగము అర్పించడమే! క్రైస్తవ జీవితం ఇచ్చే జీవితము.

## గౌరవప్రద జీవితము

*ఏడవదిగా, సమతుల జీవితం అంటే మన నాయకులను గౌరవప్రదముగా చూసుకునే జీవితము.* 17 వచనం యిలా చెప్తుంది, "మీపైని నాయకులుగానున్నవారికి ... లోబడి యుండుడి." 7వ వచనంలో చెప్పబడిన నాయకులు అన్న సందర్భంలో అది భూత కాలములో ఉంది! వారు పరలోకంలో ఇంతకుముందే ఫలము పొందియున్నారు. అయితే 17వ వచనంలోని నాయకుల గురించి చెప్పబడినప్పుడు ఇది వర్తమాన కాలంలో చెప్పబడింది. వారు అప్పటికి (హెబ్రీ పత్రిక వ్రాయబడిన సమయానికి) వారి ఆత్మలను కాస్తూనే ఉన్నారు. వారు ఎవరు? ఇది సంఘంలోని పెద్దలను సూచిస్తుంది. ఈ వచనం రెండు విషయాలను స్పష్టం చేస్తుంది:

(1) *పెద్దల బాధ్యత:* వారి బాధ్యత సంఘంలోని ఆత్మలను కాయడం. వారు నిర్ణయాధికారం గల నియంతలు లేదా దాసులు కాదు. వారికి అప్పగింపబడిన ఆత్మలను కాయడం వారి విధి. ఎంత గొప్ప బాధ్యత!

(2) *సంఘము పెద్దలతోగల సంబంధం:* సభ్యులు నాయకులకు "లోబడి వారి మాటను వినాలి" మరోమాటలో చెప్పాలంటే వారు సంఘ నాయకత్వమును సంతోషంగా అనువదించాలి. పెద్దలు తమ విధిని నిర్వర్తించే సంఘం. ఏ సంఘములోనైతే పెద్దలు తమ బాధ్యతను నిర్వహిస్తూ మరియు సభ్యులు గౌరవప్రదంగా వారిని అనుసరించే సంఘం ఎంతో సంతోషంగా ఉంటుంది!

క్రైస్తవ సంఘంలోనూ, సంఘం వెలుపలనూ, విధేయత అనే అంశం క్రైస్తవ జీవితంలో ప్రముఖంగా కనబడుతుంది. *క్రైస్తవ జీవితం విధేయత జీవితము.*

## విధేయతా జీవితము

*ఎనిమిదవదిగా. సమతుల జీవితం అంటే, విధేయతా జీవితం.* (చదవండి హెబ్రీయులకు 13:20, 21.) ఈ పత్రిక ప్రార్థనతో ముగిస్తుంది (వ్యక్తిగత సందేశం గాక) తన పాఠకులు ప్రతి మంచి విషయములోను దేవుని చిత్త ప్రకారము చేయునట్లు గ్రంథకర్త వారి నిమిత్తం ప్రార్థిస్తున్నాడు. అదే ప్రార్థన మన విన్నపం మన జీవిత లక్ష్యం కావాలి. దేవుని చిత్తమును చేయడం మరియు ఆయన దృష్టికి అనుకూలమైన దానిని చేయడం. అన్నిటికంటే ముఖ్యముగా, క్రైస్తవ జీవితం అంటే, దేవుని చిత్తమును చేయడం మరియు ఆయన్ను సంతోషపెట్టడం.

## ముగింపు

మీరు ఎలా కొలుస్తారు? హెబ్రీయులకు 13లో చెప్పబడిన విధంగా, మీ క్రైస్తవ జీవితం సమతులముగా ఉందా? దీనికి సమాధానం ఇవ్వాలంటే ఈ సాధనమును పరిశీలించి మనం ఏయే అంశంలో బలముగా ఉన్నాము, బలహీనముగా ఉన్నాము అని మనల్ని మనం పరీక్షించుకోవాలి.

ఉదాహరణకు, క్రైస్తవులు ఎదుర్కొంటున్న ప్రమాదము, సత్యమును విస్మరించి ప్రేమను గురించి ఎక్కువగా దృష్టిపెట్టడం కాదు గాని, వారు క్రైస్తవ విలువను నిర్లక్ష్యం చేసి ప్రాపంచిక దృష్టిని ఎక్కువగా కలిగియుండడం. కాబట్టి అందరూ సమతుల్యముగా జీవించునట్లు ఒకరినొకరిని ప్రోత్సాహపరచుదాము. కొంతమంది దేవునికి ప్రాధాన్యం ఇవ్వరు గనుక వారి

జీవితాలు అసంబద్ధంగా ఉంటాయి. మీరు శారీరకంగా బలంగా ఉండవచ్చు, ఆర్థికంగా ఉన్నతంగా ఉండవచ్చు. సామాజికపరంగా వృద్ధిలో ఉండవచ్చు. తెలివిగానుండవచ్చు గాని మీ జీవితంలో క్రీస్తు లేకపోతే, హెబ్రీయులకు 13లో చెప్పబడిన క్రీస్తు లక్షణాలు లేకపోతే ఈ జీవితంలో అతి ముఖ్యమైన దానిని మీరు కోల్పోయినట్లే.